Eenadu                01- 30/05/16.

● హైదరాబాద్ 'బ్రాండ్'ను తెలియజేసే రచన

**అంతర్జాతీయంగా ప్రఖ్యాతిగాంచిన నగరం హైదరాబాద్. ఎన్నో చారిత్రక కట్టడాలు, అద్భుత వారసత్వ సంపద, ఐటీలో గుర్తింపు దీనికి వన్నె తెస్తున్నాయి. ఈ కీర్తిని మరింత పెంచేందుకు అడుగులు పడుతున్నాయి. విదేశాల నుంచి ప్రముఖులు మన ప్రభుత్వ పెద్దలను కలిసినా.. ప్రభుత్వ పెద్దలే విదేశాలకు వెళ్లి అక్కడి పెట్టుబడిదారులను కలిసినా..నగర విశేషాల గురించి తప్పక ప్రస్తావనకు వస్తుంటుంది. అదే సందర్భంలో అనేకమందిని ఓ పుస్తకం కూడా ఆకట్టుకుంటోంది. అదే హైదరాబాద్- గ్రోయింగ్ గ్లోబల్'.. విశ్వనగరంగా హైదరాబాద్‌ను అంతర్జాతీయంగా మరింత పెంచేందుకు పరిమిత కాపీలతో వెలువడిన పుస్తకమిది.. విదేశాల్లో దీనికి మంచి స్పందన లభిస్తోంది.**



# విశ్వమంతా వినుతికెక్కేలా..!

ఈనాడు, హైదరాబాద్

హైదరాబాద్‌కు అన్ని హంగులు ఉన్నాయి. ఏ నగరానికి లేనంత విశాలంగా కన్పించే బాహ్యవలయ రహదారి, అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు కొద్దినెలల్లో ప్రయాణికులకు అంతర్జాతీయ ప్రయాణ అనుభూతిని అందుబాటులోకి తీసుకురాబోతున్న మెట్రోరైలు వంటి సౌకర్యాలు ఇక్కడ ఉన్నాయి. విదేశీ పర్యాటకులను ఆకర్షించే చార్మినార్, గోల్కొండ కోట, చౌమొహల్లా ప్యాలెస్, ఫలక్‌నుమా ప్యాలెస్ వంటి చారిత్రక కట్టడాలెన్నో వారసత్వ సంపదగా కొలువుదీరాయి. అయినా నగరానికి విశ్వనగరంగా రావాల్సినంత పేరు రాలేదనే భావన ఉంది. నగరంలోని ప్రత్యేకతలు.. విశేషాలు అంతర్జాతీయంగా తెలియకపోవడం ఓ కారణమని ఉన్నతాధికారులు అంటున్నారు.



**షికాగోలో కాన్సుల్ జనరల్ ఆఫ్ ఇండియా అసఫ్ సయ్యద్‌కు పుస్తకం అందిస్తున్న మంత్రి కేటీఆర్**

### అడుగులు పడుతున్నాయ్..

నాలుగువందల పాతిక సంవత్సరాల చరిత్ర.. ఐటీ నగరంగా హైదరాబాద్‌కంటూ ఇప్పటికే గుర్తింపు ఉంది. ఐటీ ఎగుమతుల్లో దేశంలోనే అగ్రపథానికి దూసుకెళ్లేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీంతో పాటు నగరం పెట్టుబడులకు అనుకూలమని చాటిచెప్పేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్.. దేశంలోనే ఉత్తమమైన పారిశ్రామిక విధానాన్ని తీసుకొచ్చారని పారిశ్రామికవేత్తలు అంటున్నారు. ఐటీపరంగా దేశంలో అగ్రపథంలో నిలిపేందుకు సంబంధిత శాఖామంత్రి కేటీఆర్ అంతర్జాతీయ ఐటీ కంపెనీలతో చర్చలు జరుపుతున్నారు. ఇప్పటికే కొన్ని తమ కార్యాలయాలను ఇక్కడ ఏర్పాటు చేశాయి. మరిన్ని పెట్టుబడులు ఆకర్షించేందుకు ప్రస్తుతం ఆయన విదేశాల్లో పర్యటిస్తున్నారు. అమెరికాలోని వేర్వేరు నగరాలకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన నగరం గురించి వివరించే హైదరాబాద్ పుస్తకాన్ని అందరికీ అందజేస్తున్నారు.

## ● విదేశాల్లో మంచి స్పందన

**ఏయే అంశాలు..**

● విశ్వనగరమంటే వినోదాలకు, విహారానికి చోటు ఉండాలి. అందుకు తగ్గట్టుగానే ఇక్కడ ట్రెక్కింగ్, సైక్లింగ్, మారథాన్‌లు ఉత్సాహపరుస్తుంటాయి. కళలు, నాటకాలు, ఫ్యాషన్, సినిమా, క్రీడలు, అంతర్జాతీయ సమావేశాలకు నగరం వేదికగా నిలుస్తుండడం వంటి విశేషాలతో పుస్తకం ఆద్యంతం ఆసక్తికరంగా రూపొందించారు.

● ఫార్చ్యూన్ 100 కంపెనీల్లో 21.. ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో 150 వరకు హైదరాబాద్‌లో ఉన్నాయనే విషయం పుస్తకంలో ప్రస్తావించారు. ఇది నగర స్థాయిని మరింత ఇనుమడింపజేస్తుంది. మిగతా కంపెనీలు ఇక్కడికి వచ్చేందుకు దోహదం చేస్తుంది. అమెరికా బయట అతిపెద్ద ప్రాంగణాలను ఏర్పాటుచేసిన కంపెనీలు మైక్రోసాఫ్ట్, గూగుల్, ఫేస్‌బుక్ కార్యాలయాలు ఇక్కడ ఉండడం హైదరాబాద్‌కు ఉన్న ప్రత్యేకతను గుర్తు చేస్తున్నాయి.

### మూడు భాగాలుగా చెప్పాం

'హైదరాబాద్ ప్రతిష్ఠను అంతర్జాతీయంగా పెంచేందుకు చేసిన సంకల్పమిది. కేటీఆర్ నాయకత్వంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఇటీవల కాలంలో ఎవరూ చేయని ప్రయత్నమిది. ఏడాదికాలంగా ఈ పుస్తకంపై శ్రమిస్తున్నాం. 425 ఏళ్ల నగర చరిత్రను ఇందులో మూడు భాగాలుగా చెప్పాం. హిస్టారికల్, హ్యాపెనింగ్, గ్లోబల్ నగరంగా ఎదిగిన తీరును ప్రస్తావించాం. ప్రస్తుతం విదేశాల్లో ఈ పుస్తకం విడుదల చేశాం. ముఖ్యంగా అమెరికా పెట్టుబడిదారులను దృష్టిలో పెట్టుకుని రూపొందించినది. దేశీయంగా పారిశ్రామికవేత్తలు, ప్రముఖులు, విధాన నిర్ణేతలకు ఈ పుస్తకాన్ని పంపించాం. వారి నుంచి స్పందన తీసుకొన్నాక దేశంలో తుది కాపీ విడుదలవుతుంది. ఇప్పటికే వచ్చిన పుస్తకానికి మంచి స్పందన లభిస్తోంది. ఐఎస్‌బీ డీన్ ఎంతో చక్కగా ఉందని అభినందించారు. అవసరాన్ని బట్టి దేశంలో టీజర్‌గా పుస్తకాన్ని విడుదల చేస్తుంటాం'



– ఎన్వీఎస్‌రెడ్డి, రచయిత
(హైదరాబాద్- గ్రోయింగ్ గ్లోబల్)

### ప్రత్యేకత ఏంటంటే..

'హైదరాబాద్' పుస్తకాన్ని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ కలికొండూరితో కలిసి మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తీసుకొచ్చారు. గత కొద్దినెలలుగా వీరు దీనిని అక్షరీకరించారు. నగరానికి వచ్చిన ఆపిల్ సీఈవో టిమ్‌కుక్‌కు ఈ నెల 19వ తేదీన ముఖ్యమంత్రి సమక్షంలో మంత్రి కేటీఆర్ ఈ పుస్తకం తొలి ప్రతిని అందజేశారు. ఇందులో నగర ప్రతిష్ఠను పెంచేవిధంగా చారిత్రక కట్టడాలు, ఉద్యానవనాలు, దేశంలోనే ఏ నగరానికి లేని రాతి సంపదకు అద్దం పట్టే చిత్రాల విశేషాల సమాహారంతో రూపొందించారు. రాజుల పాలన నుంచి గ్లోబల్ నగరంగా ఎదిగిన తీరు.. అందుకు దోహదం చేస్తున్న ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు, ఘుమఘుమలాడించే దేశ, విదేశీ వంటకాలు రుచుల నుంచి రాత్రి జీవితం.. వాతావరణం వరకు ఇందులో పొందుపరిచారు.

